## ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు వేయాల్సిందే

మొదటిపేజీ తరువాయి...

ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వాలని, విచారణ జరపాలని శాసనసభాపతికి, కార్యదర్శికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ ఆదేశాలపై గడిచిన ఆరు నెలలుగా శాసనసభ నుంచి ఎలాంటి స్పందనరాలేదు. ఇదే కాలంలో మరో ఏడుగురు సభ్యులు కూడా పార్టీ మారారు. మొత్తం 10 మందిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్పీకర్‌కు బీఆర్‌ఎస్ ఫిర్యాదు చేసింది. స్పీకర్ నుంచి ఆశించిన స్పందన రాలేదని బీఆర్‌ఎస్ అనేక సందర్భాల్లో పేర్కొన్నది. శాసనసభ కార్యదర్శి, స్పీకర్ నుంచి ఆరు నెలలైనా స్పందన లేకపోవడంతో తాజాగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసి 9 నెలలవుతున్నా చర్యలు తీసుకోవడంలేదని సుప్రీంకోర్టులో దాఖలు చేసి పిటిషన్‌లో బీఆర్‌ఎస్ పేర్కొన్నది. దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై ఎస్‌ఎల్పీ దాఖలు చేశారు. మిగిలిన ఏడుగురికి వ్యతిరేకంగా రిట్ పిటిషన్ దాఖలు చేశారు.

## ఏస్ నెక్ట్స్ జెన్‌కు ఏసీబీ నోటీసులు

### 18న విచారణకు రావాలని పిలుపు

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో తొలి ప్రమోటర్, గ్రీన్‌కో అనుబంధ సంస్థ ఏస్ నెక్ట్స్‌జెన్‌కు గురువారం ఏసీబీ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఈ నెల 18న విచారణకు రావాలని నోటీసులో పేర్కొన్నారు. ఈ కేసులో ఇప్పటికే మాజీ మంత్రి కేటీఆర్, సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్‌కుమార్, హెచ్‌ఎండీఏ రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ బీఎల్‌ఎన్ రెడ్డిని ఏసీబీ విచారించింది. మలివిడత విచారణలో భాగంగా సీజన్-9 రేస్‌కు ప్రమోటర్‌గా ఉన్న ఏస్ నెక్ట్స్ జెన్ నష్టాలను చూపుతూ సీజన్-10 నుంచి తప్పుకున్నది. ఇటీవల గ్రీన్‌కో, ఏస్ నెక్ట్స్‌జెన్ కంపెనీల్లో ఏసీబీ అధికారులు సోదాలు సైతం నిర్వహించారు.

## నేడు షాబాద్‌లో రైతుధర్నా

షాబాద్, జనవరి 16: బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నేడు షాబాద్‌లో నిర్వహించే రైతుధర్నాను విజయవంతం చేయాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ యువనేత పట్నం అవినాశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రైతుధర్నాకు సంబంధించిన సభ స్థలాన్ని, ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శుక్రవారం ఉదయం 11గంటలకు షాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించే రైతుధర్నా కార్యక్రమానికి బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, పార్టీ శ్రేణులు హాజరుకానున్నట్లు తెలిపారు.

## పరువు నష్టం కేసులో వాదనలు పూర్తి చేయాలి

- కొండా సురేఖ, నాగార్జున లాయర్లకు కోర్టు ఆదేశం

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జనవరి 16 (నమస్తే తెలంగాణ): మంత్రి కొండా సురేఖపై సినీనటుడు నాగార్జున దాఖలు చేసిన పరువునష్టం కేసుపై నాంపల్లి కోర్టు గురువారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా సురేఖ, నాగార్జున తరపు న్యాయవాదులు కోర్టుకు హాజరై క్లయింట్ల తరపున గైర్హాజరు పిటిషన్లు దాఖలు చేయగా కోర్టు అంగీకరించింది. వాదనలు పూర్తి చేయాలని ఇరువర్గాల లాయర్లను కోర్టు ఆదేశించింది. కొంత సమయం కావాలని న్యాయవాదులు కోరగా విచారణను కోర్టు 30కి వాయిదా వేసింది. వచ్చే వాయిదాకు వాదనలు పూర్తి చేయాలని స్పష్టంచేసింది.

# సుంకె ఇంటిపై దాడికి యత్నం

- కాంగ్రెస్ కార్యకర్తల విఫలయత్నం
- నినాదాలు చేస్తూ వీధుల్లో వీరంగం
- కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు
- గంగాధర మండలం బూరుగుపల్లిలో ఘటన
- మాజీ ఎమ్మెల్యే ఇంటిపై దాడి దుర్మార్గం: కేటీఆర్



కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూరుగుపల్లిలోని రవిశంకర్ ఇంటిపై దాడి చేయడానికి వచ్చిన యూత్ కాంగ్రెస్ నాయకులు





బూరుగుపల్లిలో యూత్ కాంగ్రెస్ నాయకులను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

కరీంనగర్, జనవరి 16 (నమస్తే తెలంగాణ)/గంగాధర : బీఆర్‌ఎస్ కార్యాలయాల్లోకి వచ్చి మరీ ఆ పార్టీ నేతలను కొడతామంటూ కాంగ్రెస్ పార్టీకి చెందిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఇటీవల చేసిన హెచ్చరికల నేపథ్యంలో అతని అనుచరులు, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు గురువారం సాయంత్రం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఇంటిపై దాడికి యత్నించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూరుగుపల్లిలోని వీధుల్లో పరుగులు తీస్తూ సుంకె రవిశంకర్ ఇంటిపై దాడి చేసేందుకు వారు విఫలయత్నం చేశారు. వారు వీధుల్లో వీరంగం సృష్టిస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు వీధుల్లో పరుగులు తీస్తున్న దృశ్యాలు వైరల్‌గా మారాయి. పోలీసులు వారిని వెంబడించి దాడి జరగకుండా అడ్డుకున్నారు.

### ఎమ్మెల్యే సత్యం హెచ్చరికలతోనే..

కాంగ్రెస్ పార్టీకి చెందిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గత సోమవారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. బీఆర్‌ఎస్ కార్యాలయాల్లోకి వెళ్లి మరీ వారిని కొడతామని హెచ్చరించారు. కరీంనగర్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా రవిశంకర్ చేసిన పలు వ్యాఖ్యలను చొప్పదండి నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు ఖండించారు. కానీ, అత్యుత్సాహం ప్రదర్శించిన కొంతమంది యూత్ కాంగ్రెస్ నేతలు రవిశంకర్ ఇంట్లో లేని సమయం చూసి ఆయన ఇంటిపై దాడికి యత్నించారు. పోలీసులు అడ్డగిస్తున్నా ఆగకుండా ఇంటి గేటును తోసుకుని లోపలికి వెళ్లేందుకు యత్నించారు. రవిశంకర్ కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. తమ ఇంటిపై దాడి జరుగుతున్నదని భయంతో కేకలు వేశారు. కాంగ్రెస్ పార్టీ, ఎమ్మెల్యే మేడిపల్లికి అనుకూలంగా నినాదాలు చేస్తూ హంగామా సృష్టిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులను పోలీసులు బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. దాడికి యత్నించిన యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్, నియోజకవర్గ అధ్యక్షుడు యజ్ఞేశ్‌తో పాటు మరికొందరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి వదిలేసినట్టు తెలిసింది.

### దాడి యత్నాన్ని ఖండించిన మాజీ ఎమ్మెల్యే

తన ఇంటిపై యూత్ కాంగ్రెస్ నాయకులు దాడికి యత్నించడంపై మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తీవ్రంగా స్పందించారు. ఇటీవల ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేసిన అనుచిత వ్యాఖ్యలను తాను ప్రజాస్వామ్య పద్ధతిలో ఖండించానని.. కానీ, కాంగ్రెస్ మాత్రం తన ఇంటిపై దాడికి దిగిందని మండిపడ్డారు. ఎమ్మెల్యే సత్యం ప్రోద్బలంతోనే కాంగ్రెస్ కార్యకర్తలు గూండాల్లా వ్యవహరించి దాడికి యత్నించి, తన కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేశారని పేర్కొన్నారు. దమ్ముంటే ప్రజాస్వామ్య పద్ధతిలో తనతో పోరాడాలని, దాడులు చేస్తే తాము చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

## కాంగ్రెస్ గూండాల అరాచకం

### రేవంత్ ముఠాల బెదిరింపులకు భయపడం: కేటీఆర్


హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): 'చొప్పదండి మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నేత సుంకె రవిశంకర్ ఇంటిపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం దుర్మార్గం.. రేవంత్‌రెడ్డి ముఠా బీఆర్‌ఎస్ నేతల ఇండ్లపై దాడులు చేస్తూ అరాచకాలు సృష్టించేందుకు యత్నిస్తున్నది' అంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తున్నారనే నెపంతో ఇలాంటి దురాగతాలకు తెగబడుతున్నారని ఆరోపించారు. అధికార పార్టీ బెదిరింపులకు బీఆర్‌ఎస్ భయపడబోదని తేల్చిచెప్పారు. అడుగడుగునా కాంగ్రెస్ మోసాలు, అవినీతిని ఎండగడతామని గురువారం ఎక్స్ వేదికగా విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గుండాలు దాడులకు తెగబడుతూ అరాచకాలు సృష్టిస్తున్నా పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం దారుణమని పేర్కొన్నారు. ఇప్పటికైనా దాడులకు ముగింపు పలకాలని లేదంటే ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. డీజీపీ వెంటనే స్పందించి కాంగ్రెస్ అల్లరిమూకలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## కవిత సుదీర్ఘ పోరాట ఫలితమే పసుపుబోర్డు

జగిత్యాల రూరల్, జనవరి 16: మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ కవిత సుదీర్ఘ పోరాట ఫలితమే పసుపు బోర్డు ఏర్పాటు అని జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి పసుపు క్షేత్రంలో గురువారం రైతులతో కలిసి తెలంగాణ తొలి సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కవిత నాయకత్వంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు చాలా సార్లు కేంద్ర మంత్రులను కలిశారని వసంత గుర్తుచేశారు. పసుపు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి, కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.15 వేలు ఉండేలా చూడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

## లోకం పోకడ





ఈయన మనపార్టీ కాదు, పైగా ఈయన మీద లక్ష రూపాయల అవినీతి ఆరోపణలున్నాయి.. ఎన్నికోట్లు ఖర్చు అయినా సరే విచారణ జరిపించాల్సిందే!!

## గువ్వలపై కేసు నమోదు



అచ్చంపేట, జనవరి 16: అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతోపాటు మరి కొంతమంది బీఆర్‌ఎస్ నేతలపై కేసు నమోదైంది. బుధవారం రాత్రి పట్టణంలోని భ్రమరాంబ ఆలయం వద్ద ప్రభోత్సవం ఊరేగింపు సందర్భంగా ఆలయంలోకి వెళ్లేందుకు గువ్వల దంపతులు వచ్చారు. ఆలయం లోపల స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ ఉండడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ నాయకులు, పోలీసులు, బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో పోలీసుల తీరును నిరసిస్తూ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల ఆలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో గురువారం వీరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై రమేశ్ తెలిపారు.

### కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

- బెయిల్ పూచీకత్తుల సమర్పణ

కరీంనగర్ కోర్టుచౌరస్తా, జనవరి 16: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి మంజూరైన బెయిల్‌కు సంబంధించిన పూచీకత్తులను గురువారం కరీంనగర్ మేజిస్ట్రేట్ కోర్టుకు హాజరై సమర్పించారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో ఈ నెల 12న నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో గొడవకు సంబంధించి కౌశిక్‌రెడ్డిపై కరీంనగర్ వన్ టౌన్‌లో రెండు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. కోర్టు ఆదేశాల ప్రకారం కౌశిక్‌రెడ్డి నలుగురు వ్యక్తులను జమానతుగా సమర్పించగా కోర్టు స్వీకరించింది.

## కేఎల్ వర్సిటీ ప్రవేశ ఫలితాలు విడుదల

- ఇంజినీరింగ్‌కు 80% మంది విద్యార్థుల అర్హత
- ఫిబ్రవరి 7 నుంచి రెండో విడత ప్రవేశ పరీక్ష

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 16 (నమస్తే తెలంగాణ): కేఎల్ యూనివర్సిటీ (విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో) ఇంజినీరింగ్ కోర్సులలో ప్రవేశానికి మొదటి విడత ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ పార్థసారథి వర్మ విజయవాడలోని యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆన్‌లైన్ ద్వారా ఫలితాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో జాతీయ స్థాయిలో నిర్వహించిన మొదటి విడత ప్రవేశ పరీక్షకు లక్ష మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. ఇందులో 80 శాతం మంది విద్యార్థులు అర్హత పొందారని వెల్లడించారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన ర్యాంకులు, ఇంటర్ మార్కుల ఆధారంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్ ద్వారా ఫీజులో మినహాయింపు ఇస్తామని ప్రకటించారు. రెండో విడత ప్రవేశ పరీక్షను ఫిబ్రవరి 7 నుంచి 9 వరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జే శ్రీనివాసరావు మాట్లాడుతూ.. డిగ్రీ, పీజీ, సైన్స్ కోర్సులకు జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఇంజినీరింగ్ మొదటి విడతలో మెరుగైన ర్యాంకు పొందలేని వారు రెండో విడత ప్రవేశ పరీక్ష రాసుకోవచ్చని సూచించారు. ఫలితాల కోసం https://www.kluniversity.in/, 9648229999 నెంబర్ల ద్వారా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.






కేఎల్ వర్సిటీ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ డాక్టర్ పార్థసారథి

# హైదరాబాద్ రియల్టీ ఢమాల్!

- కుప్పకూలుతున్న రియల్ ఆశల సౌధాలు
- మరో అధ్యయనంలో నిజాలు తేటతెల్లం
- ప్రభుత్వ విధానాలతోనే అగమ్యగోచరం
- 36% సేల్స్ డౌన్ అని తేల్చిన 'ప్రాప్‌టైగర్'

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 16(నమస్తే తెలంగాణ): గతమెంతో ఘనం.. భవిష్యత్తు ప్రశ్నార్థకం.. అన్నట్టుగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ వ్యాపార పరిస్థితి మారింది. ఒకప్పుడు ఎకరం రూ.100 కోట్లకు విక్రయించి, ప్రపంచస్థాయి పెట్టుబడులను ఆకర్షిస్తే, ఇప్పుడు కనీసం కట్టిన ఇండ్లను కూడా అమ్ముకోలేని దయనీయ పరిస్థితి దాపురించింది. ఏడాదిగా పడిపోయిన రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు ప్రాప్‌టైగర్ నివేదిక నిదర్శనంగా నిలుస్తున్నది. దేశంలోని అన్ని మెట్రో నగరాల్లో ఉన్న క్రయవిక్రయాలపై వెల్లడించిన ప్రాప్‌టైగర్ నివేదికలో హైదరాబాద్‌లో నిరుటితో పోల్చితే 2024 అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో 36% మేర అమ్మకాలు పడిపోయినట్టుగా తేలింది. ఓవైపు హైదరాబాద్ కేంద్రంగా రియల్ ఎస్టేట్ పరుగులు పెడుతున్నదని ప్రభుత్వం బుకాయిస్తున్నా, క్షేత్రస్థాయి వాస్తవాలు ఇలాంటి నివేదికలతో వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో హైదరాబాద్ కేంద్రంగా రియల్ ఎస్టేట్ రంగం ఏడాదిగా కోలుకోలేకపోతున్నది. మహానగరంలో మార్కెట్ స్థితి, ఇండ్ల నిర్మాణం, అమ్మకాల తీరు తెన్నులపై ప్రముఖ రియల్ ఎస్టేట్ అధ్యయన సంస్థ అయిన ప్రాప్‌టైగర్ వార్షిక నివేదికను విడుదల చేసింది. 2023తో పోల్చితే హైదరాబాద్ కేంద్రంగా అమ్మకాలు భారీగా క్షీణించినట్టు వెల్లడైంది. దేశవ్యాప్తంగా 4% వృద్ధి ఉంటే హైదరాబాద్‌లో మాత్రం డౌన్ ట్రెండ్ కొనసాగుతూనే ఉన్నదని తేలింది. నగరంలో కొన్ని నెలలుగా రిజిస్ట్రేషన్లు భారీగా పడిపోగా, ముఖ్యంగా ఇండ్లు, ఓ పెన్ ప్లాట్ల క్రయవిక్రయాలు క్రమంగా తగ్గుతున్నాయి.



**అమ్మకాల్లో పడిపోయిన తీరు**

| | |
|---|---|
| హైదరాబాద్ | 36 |
| అహ్మదాబాద్ | 34 |
| పుణే | 31 |
| ముంబై | 31 |
| బెంగళూరు | 23 |
| చెన్నై | 05 |

### మార్కెట్‌ను కొల్లగొట్టిన సర్కార్ చర్యలు

2023 ఆగస్టు నెల నుంచే హైదరాబాద్ పరిధిలో క్రయవిక్రయాలు పడిపోయాయి. ఇప్పటివరకు సిటీ రియాల్టీ దిగజారుతూనే ఉన్నది. పదుల సంఖ్యలో అమ్మకాలు క్షీణించినట్టుగా అధ్యయనాలు వెల్లడించాయి. ప్రభుత్వం దిద్దుబాటు చర్యలపై దృష్టి పెట్టకుండా, మార్కెట్‌ను మరింత దెబ్బకొట్టే చర్యలకు దిగింది. మూసీ ప్రక్షాళన, ఫార్మా సిటీ రద్దు, ఎయిర్‌పోర్టు మెట్రో లైన్ మార్పు, హైడ్రా, వక్ఫ్ భూముల పేరిట రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో రియల్ ఎస్టేట్ వ్యవస్థ కోలుకోలేకపోతున్నది. నిర్మాణ అనుమతుల్లోనూ కాంగ్రెస్ నేతల చేతివాటంతో బిల్డర్లు బెంబేలెత్తుతున్నారనే విమర్శలు ఉన్నాయి. రియల్ ఎస్టేట్ సంస్థలు ప్రాపర్టీ షోలతో మార్కెట్‌ను ప్రభావితం చేయాలని భావించినా ఫలితం దక్కలేదని తెలిసింది.

### సేల్స్ డౌన్ నగరాల జాబితాలో హైదరాబాదే టాప్

ప్రాప్‌టైగర్ నివేదిక ప్రకారం దేశంలో అత్యధికంగా అ మ్మకాలు పడిపోయిన నగరాల జాబితాలో 36%అమ్మకాలు తగ్గి హైదరాబాద్ తొలిస్థానంలో ఉండగా, 5 శాతం అమ్మకాలు మాత్రమే తగ్గి చెన్నై చివరన ఉన్నది. పదేండ్లకాలంగా ఆకాశన్నంటే స్థాయిలో బహుళ అంతస్తుల భవనాలు దూసుకుపోగా, ఇప్పుడేమో హైడ్రా పేరిట పలుచోట్ల పేక మేడల్లా భవనాలు కూలిపోతున్నాయి. సామాన్య జనాలతోపాటు, రియల్ ఎస్టేట్ వ్యాపారులూ భయాందోళనకు గురవుతున్నారు. 8 నెలలుగా పేదలు, సామాన్యుడికి కంటిమీద కునుకు లేకుండా హైడ్రాను ప్రభుత్వం ఉసిగొల్పిందని గగ్గోలు పెడుతున్నారు.